ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 22 జూలై 2024

కోటవురట్ల మండలం యండపల్లిలో నీటమునిగిన నువ్వుచేను



పులకించిన సింహగిరి

విజయవంతంగా ముగిసిన గిరి ప్రదక్షిణ

- సుమారు పది లక్షల మంది పాల్గొన్నట్టు అంచనా
- భక్తులతో పోటెత్తిన సింహాచలం



గిరి ప్రదక్షిణ ముగించి తొలిపావంచా వద్దకు చేరిన భక్తులు

సింహాచలం, జూలై 21:

సింహగిరి భక్త జన ప్రవాహంతో పులకించింది. గిరి ప్రదక్షిణ ఉత్సవం ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు కొండదిగువ తొలిపావంచా నుంచి అప్పన్న పుష్పరథం భక్తుల హరి నామస్మరణల నడుమ బయలుదేరింది. అడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక కూడలి, అప్పూఘర్, ఇసుకతోట, మద్దిలపాలెం, గురుద్వార, మాధవధార, ఎన్ఏడీ, గోపాలపట్నం, ప్రహ్లాదపురం మీదుగా రాత్రి 10.30 గంటలకు సింహాచలం చేరుకుంది. భక్తులు ఆదివారం ఉదయం చేరుకోవడంతో ఆరు గంటల నుంచి 10 గంటల వరకు గోశాలకూడలిలో విపరీతమైన రద్దీ నెలకొంది. కాగా గిరి ప్రదక్షిణలో సుమారు 10 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు అధికారులు అంచనా వేశారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఎక్కువ మంది యువత ఉత్సవంలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసిన భక్తుల్లో కొందరు మెట్లమార్గంలో సింహగిరికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

త్వరితగతిన దర్శనాలు

ముందుగా ప్రకటించినట్టే ఆదివారం వేకువజామున మూడు గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు.



కొండ పైనుంచి కిందకు రావడానికి బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న భక్తులు

సాయంత్రం ఐదు గంటల వరకు సుమారు 10 వేల మంది భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, విద్యుత్ దీపాలను అమర్చారు. భక్తులకు దర్శనం అనంతరం నిత్యాన్న ప్రసాదం అందజేశారు. పిఠాపురానికి చెందిన ఆధ్యాత్మిక సంస్థ కదంబం, దద్దోజనం, చక్కెర పొంగలి, ఒడిశాకు చెందిన ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయక్ దాసుడి బృందం పులిహోర, సింహగిరి వర్తకుల సంఘం ఆధ్వర్యంలో పొంగలి ప్రసాదాలను వితరణ చేశారు. ఈవో సింగాల శ్రీనివాసమూర్తి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర ... మిగతా 8వ పేజీలో

వీడని ముసురు

పలు మండలాల్లో తేలికపాటి జల్లులు

- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- జలాశయాలు కళకళ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

జిల్లాలో ముసురు వాతావరణం కొనసాగుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా విరివిగా వర్షాలు కురిసినా ఆదివారం మాత్రం జిల్లా వ్యాప్తంగా ముసురుతో కూడిన చల్లని వాతావరణం నెలకొంది. పలు మండలాల్లో ఒక మోస్తరు తేలికపాటి జల్లులు కురిశాయి. కాగా నదులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రిజర్వాయర్‌లు కళకళలాడుతున్నాయి.



నిండు కుండలా కల్యాణపులోవ రిజర్వాయర్



వడ్డాదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు నది

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఆదివారం సాయంత్రానికి మరింత బలహీన పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో జిల్లాలో ముసురుతో కూడిన వాతావరణం నెలకొనగా అనకాపల్లి, నర్సీపట్నం, కశింకోట, మునగపాక, చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. సబ్బవరం, అచ్యుతాపురం, ఎస్.రాయవరం, ఎలమంచిలి, పాయకరావుపేట, కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం, రాంబిల్లి, రోలుగుంట, గొలుగొండ మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మిగతా చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. వర్షాల కారణంగా మండలాల్లో ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు కలగలేదని అధికారులు తెలిపారు.

వరి నారుమడుల తయారీకి అనుకూలం

జిల్లాలో కురుస్తున్న తేలికపాటి జల్లులు వరి నారు మడులు తయారీకి అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత వారం వరకు వర్షాలు లేక వరి నారు మడులు తయారు చేసుకోకుండా నిరాశ చెందిన రైతులకు ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కొందరు రైతులు నారు మడుల తయారీకి సిద్ధమవుతుండగా, మరికొందరు వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎద పద్ధతిలో వరి సాగు చేసేందుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు.

వర్ష బీభత్సం

- వెంకునాయుడుపేట, లోసింగిలో కూలిన పెంకుటిళ్లు



వెంకునాయుడుపేటలో కూలిపోయిన పెంకుటిల్లు పైకప్పు

నర్సీపట్నం/రోలుగుంట, జూలై 21:

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ పెంకుటిల్లు నానిపోయి పైకప్పు కూలిపోయింది. ఆదివారం వెంకునాయుడుపేటకు చెందిన దన్నిన అమ్మలుకి చెందిన పెంకుటిల్లు పైకప్పు పూర్తిగా కూలిపోవంతో దుస్తులు, వంట పాత్రలు ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద ఉండిపోవడంతో అమ్మలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. 22వ వార్డు కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య ద్వారా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వీఆర్‌వో వివరాలు నమోదు చేసుకున్నారు. ఆదివారం నర్సీపట్నంలో 12.4 ఎంఎం వర్షపాతం నమోదైంది.



లోసింగిలో కూలిన పెంకుటిల్లు

లోసింగిలో..

మూడు రోజులుగా ముసురు వీడడం లేదు. రోలుగుంట మండలంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో మండలంలోని అర్ల పంచాయతీ శివారు లోసింగిలో తాంబేలు రమణకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఇంట్లో ఉన్న ధాన్యం, ఇతర తిండి గింజలు తడిసి ముద్దయ్యాయి.



అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఎన్‌జీవో కాలనీలో విశేష అలంకరణలో సాయినాథుడు

సాయినాథునికి విశేష పూజలు

గురు పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని షిర్డీ సాయిబాబా ఆలయాలను అందంగా అలంకరించారు. షిర్డీ సాయినాథునికి ఆదివారం వేకువజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు.



టీడీపీ, జనసేనలో చేరిక కార్పొరేటర్లతో కూటమి నేతలు

జీవీఎంసీలో రాజకీయ చదరంగం

మారుతున్న సమీకరణలు

- వైసీపీకి 12 మంది కార్పొరేటర్లు రాజీనామా
- ఏడుగురు టీడీపీ, ఐదుగురు జనసేనలో చేరిక
- ప్రస్తుతం వైసీపీకి 47, టీడీపీకి 36, జనసేనకు పది మది సభ్యుల బలం
- బీజేపీ, సీపీఐ, సీపీఎం, ఇండిపెండెంట్లు ఒక్కొక్కరు
- స్టాండింగ్ కమిటీ సభ్యుల విజయానికి 49 ఓట్లు అవసరం
- వైసీపీతో సమానంగా కూటమి బలం
- మరికొందరు వైసీపీని వీడి కూటమిలో చేరుతారని ప్రచారం
- ఉన్నవారిని కాపాడుకునే ప్రయత్నాల్లో వైసీపీ నేతలు
- వచ్చే నెల ఏడున జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలకసంస్థ (జీవీఎంసీ)లో మారుతున్న రాజకీయ సమీకరణలు ఆసక్తి రేపుతున్నాయి. స్టాండింగ్ కమిటీ ఎన్నిక వచ్చే నెల ఏడున నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ పీఠంతో పాటు స్టాండింగ్ కమిటీలోని పది స్థానాలను దక్కించుకోవడంపై కూటమి నేతలు గురిపెట్టారు. ఇందులో భాగంగా 12 మంది వైసీపీ కార్పొరేటర్లు ఆ పార్టీని వీడి ఆదివారం టీడీపీ, జనసేనలో చేరిపోయారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 47కి తగ్గిపోగా, కూటమి బలం 47కి పెరిగింది. స్టాండింగ్ కమిటీని కైవసం చేసుకోవాలంటే కూటమికి మరో ఇద్దరు కార్పొరేటర్ల మద్దతు అవసరం. అయితే అదే సమయంలో టీడీపీలో అసమ్మతి కార్పొరేటర్ల మద్దతు కోసం వైసీపీ నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

జీవీఎంసీలో ప్రస్తుత స్టాండింగ్ కమిటీ పదవీకాలం ఈ నెలాఖరుతో ముగుస్తుంది. తక్షణం కమిటీకి ఎన్నిక ... మిగతా 8వ పేజీలో

విశాఖ కార్పొరేషన్‌లో వైసీపీకి షాక్

కూటమిలో చేరిన 12 మంది కార్పొరేటర్లు - వివరాలు మెయిన్‌లో..



శాకంబరి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు

శాకంబరిగా కనకదుర్గమ్మ

స్థానిక గవరపాలెం సతకంపట్టులో కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు ఆదివారం ఆషాఢ మాసం గురుపౌర్ణమి సందర్భంగా శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. - అనకాపల్లి టౌన్

శిథిల గదుల్లో విద్యాబోధన వద్దు

విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యం

- నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదన
- డీఈవో వెంకటలక్ష్మమ్మ



పెదబోదిగల్లం హైస్కూల్ తరగతి గదులను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నక్కపల్లి, జూలై 21:

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల తరగతి గదుల్లో విద్యాబోధన చేయకూడదని, చదువుతో పాటు పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. ఆదివారం నక్కపల్లి మండలం పెదబోదిగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను ఆమె పరిశీలించారు. ఈ పాఠశాలలో కొన్ని తరగతి గదులు శిథిలావస్థలో వున్నట్టు ఆమె గుర్తించారు. వర్షాలకు గోడలు తడిసి పడిపోయే ప్రమాదం వుందని, అందువల్ల అటువంటి భవనాల్లో తరగతి గదులను నిర్వహించకూడదని హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల భవనంలో హైస్కూల్‌కు సంబంధించి రెండు తరగతులను నిర్వహించాలని ఆమె ఆదేశించారు. శిథిలావస్థలో వున్న పాఠశాల భవనాల పునర్నిర్మానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్టు చెప్పారు. ఆమె వెంట జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, ఎంఈవో నరేశ్, ఇంజనీరింగ్ డీఈఈ జీజేవీ ప్రసాద్, ఏఈ డి.సత్య స్వరూప్, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.లక్ష్మణరావు, స్కూల్ కమిటీ చైర్మన్ మహబూబున్నీషా, ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు, సెక్రటరీ జయ ప్రకాశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి కాకినాడ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు ప్రారంభం

అనకాపల్లి టౌన్, జూలై 21:

అనకాపల్లి పీటీడీ డిపో నుంచి కాకినాడకు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు అందుబాటులోకి రానుంది. సోమవారం ఉదయం ఆరున్నర గంటలకు అనకాపల్లి డిపో నుంచి ఈ బస్సు బయలుదేరి చోడవరం వెళ్లి, తిరిగి అనకాపల్లి మీదుగా ఎలమంచిలి, తుని వయా కాకినాడకు చేరుకుంటుందని పీటీడీ అధికారులు తెలిపారు. తిరిగి కాకినాడ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి తుని, ఎలమంచిలి, అనకాపల్లి మీదుగా విశాఖపట్నంకు చేరుకుంటుందన్నారు. తిరిగి విశాఖపట్నం నుంచి బయలుదేరి అనకాపల్లికి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ తీగ తెగి పడి యువకుడి మృతి

పాడి గేదె కూడా..

రాంబిల్లి, జూలై 21:

విద్యుత్ తీగ తెగిపడి ఓ యువకుడు, పాడి గేదె మృతి చెందాయి. రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గ్రామానికి చెందిన మారపురెడ్డి జయశంకర్(25) అచ్యుతాపురంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తూ ఖాళీ సమయంలో కుటుంబ పనుల్లో తల్లికి సహాయంగా ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పాడి గేదెను గ్రామ సమీపంలో మేపుతుండగా ఒక్కసారిగా విద్యుత్ తీగ తెగి అతనితో పాటు పాడి గేదెపై పడింది. దీంతో అతనితో పాటు పాడి గేదె మృతి చెందాయి. ఒక్కగానొక్క కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో అతని తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుని తల్లి సత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



పంచదార్ల గ్రామంలో విద్యుత్ తీగ తెగిపడి మృతి చెందిన యువకుడు, పాడి గేదె



మారపురెడ్డి జయశంకర్ మృతదేహం



సీలేరు సమీపంలో ఎక్స్‌కవేటర్‌తో చెట్టును తొలగిస్తున్న దృశ్యం...



మార్గమధ్యంలో నిలిచిపోయిన భద్రాచలం-విశాఖపట్నం నైట్ సర్వీస్

సీలేరు సమీపంలో కూలిన భారీ చెట్టు

ఆరు గంటల పాటు నిలిచిన రాకపోకలు.. ప్రయాణికుల అగచాట్లు

సీలేరు, జూలై 21: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు శనివారం రాత్రి సీలేరు సమీపంలో రహదారికి అడ్డంగా భారీ చెట్టు పడిపోవడంతో ఉదయం ఐదు గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. సీలేరుకు ఒక కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిపై రాత్రి పదిన్నర గంటల సమయంలో భారీ చెట్టు కూలిపోయింది. దీంతో భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సు సీలేరు చెక్ పోస్టు వద్దనే నిలిపివేశారు. అలాగే విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లే రెండు నైట్ సర్వీస్ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమాచారం అందుకున్న ఆర్అండ్‌బీ అధికారులు చెట్టును ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. వారికి ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది సహకరించడంతో ఆదివారం ఉదయం 5 గంటలకు ఆ రోడ్డుపై రాకపోకలు ప్రారంభమయ్యాయి.

'పేట'లో లండన్ ఐవీఎఫ్ కేంద్రం ప్రారంభం



ఐవీఎఫ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, చిత్రంలో డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రరెడ్డి, డాక్టర్ ఎస్.అనన్య తదితరులు

పాయకరావుపేట, జూలై 21 : పాయకరావుపేట, తుని, అనకాపల్లి పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పాయకరావుపేటలో లండన్ ఐవీఎఫ్‌వారి సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేసినట్టు సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక సూర్యమహల్ సెంటర్‌లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాన్ని ఆదివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఏపీలో సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు దశాబ్ధకాలంగా అత్యంత ఆధునిక విధానాల ద్వారా అంతర్జాతీయ స్థాయి చికిత్సను అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. సంతానం లేని దంపతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.అనన్య, డాక్టర్ మాధవీలత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేశ్‌తో పాటు గ్రామ పెద్దలు దేవవరపు సూర్యం, జగతా శ్రీనివాస్, దేవవరపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అడ్డరోడ్డు క్రీడాకారుల సత్తా

తొమ్మిది బంగారు, రెండు రజిత, నాలుగు కాంస్య పతకాలు సొంతం

వచ్చే నెలలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత



రాష్ట్ర స్థాయి తైక్వాండోలో పతకాలు సాధించిన క్రీడాకారులు

ఎస్.రాయవరం, జూలై 21 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, కేడెట్ తైక్వాండో కొరిగి, హూమ్సే చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని అడ్డ రోడ్డుకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. గుంటూరు జిల్లా రేపల్లెలో శుక్ర, శనివారాల్లో జరిగిన సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు అడ్డరోడ్డుకు చెందిన ఇరవై మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో కె.హిమబిందు, ఎం.గ్రేసి, కె.అభిలాస్య, జి.కుస్మిత, టి.నిఖిల్, జె.హేమంత్, వి.దుర్గాప్రసాద్, ఎం.అశోక్, శ్యామ్‌లు అద్భుతంగా రాణించి బంగారు పతకాలు సాధించారు. అలాగే, డి.తేజ, కె.నాగాంజలిరజితం, పి.సాయిగౌతమి, ఎస్.వంశీ, ఎం.దుర్గాప్రసాద్, దుర్గ కాంస్య పతకాలను సొంతం చేసుకున్నట్టు తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి రామ్‌చరణ్ ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఈ క్రీడాకారులంతా ఆగస్టు 16, 17 తేదీల్లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) కోచ్‌లు ఎం.చిరంజీవి ఎస్‌వీఎస్ రమేష్‌లు అభినందించారు.

శాకంబరిదేవిగా వరమహాలక్ష్మి అమ్మవారు



పాయకరావుపేట, జూలై 21: పట్టణంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చిట్టూరి మెట్రో ప్రాంగణంలో కొలువుదీరిన వైకుంఠ నారాయణ సమేత వరమహాలక్ష్మి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కొనసాగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులు

విశాఖపట్నం, జూలై 21: వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆదివారం ఆయన కార్పొరేట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు చేస్తూ త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షాల వల్ల అయిదు సర్కిళ్ల పరిధిలోని 24 మండలాల్లో 140 గ్రామాల్లో 47,999 సర్వీస్ కనెక్షన్లకు అంతరాయం కలిగిందన్నారు. టోల్‌ఫ్రీ నెంబరు, కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసి క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన చేరవేయడం ద్వారా తక్కువ సమయంలోనే సరఫరాను పునరుద్ధరించగలిగామన్నారు. ఏలూరు, రాజమండ్రి సర్కిళ్లలో ఎక్కువ నష్టం వాటిల్లిందని వెల్లడించారు. కుక్కునూరు, వేలేరుపాడు, రాజీవ్‌నగరం, మారేడుమిల్లి లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతినగా వాటిని తక్షణమే పునరుద్ధరించామని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

వాన.. వరద

ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా, సర్పా, శారదా నదులు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

కోటవురట్లలో నీటమునిగిన పంట పొలాలు

ఆందోళన చెందుతున్న రైతులు

కోటవురట్ల, జూలై 21: అల్పపీడనం కారణంగా మండలంలో గత మూడు రోజులు భారీ వర్షాలు కురిశాయి. ఎడతెరిపి లేకుండా పడడంతో నదులు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. వీధి రోడ్లు జలమయమయ్యాయి. పంటలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరహా, సర్పా నదులు గట్లకు అనుకొని ఉరకలేస్తున్నాయి. వరహానది ఉధృతంగా ప్రవహించడంతో దుగ్గాడ కాలువ పరవళ్లు తొక్కుతోంది. నువ్వు, వరి, కాయకూర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట చేతికి అందే సమయంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా నష్టం వాటిల్లిడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో వరినారు ఎదుగుదల లేకపోవడంతో నీటమునిగింది. కోటవురట్ల మండలం తిమ్మాపురం, కె.వెంకటాపురం, లింగాపురం, కోటవురట్ల, కొడవటిపూడి గ్రామాల్లో పత్తిపంట పొలాల్లోనే తడిసి ముద్దయింది. కె.వెంకటాపురం నుంచి కొడవటిపూడి వెళ్లే దారి మధ్యలో కొండ గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలో ఆదివారం ఉదయం ఐదు గంటలనుంచి సాయంత్రం మూడు గంటల వరకు 30.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు.



జల్లూరులో నీటమునిగిన కూరగాయల పంటలు



పూడిమడక తీరంలో సురక్షిత ప్రాంతాలకు తరలించిన పడవలు

పూడిమడక తీరంలో పెరిగిన అలల ఉధృతి

» ముందుకు చొచ్చుకు వచ్చిన సముద్రం

అచ్యుతాపురం, జూలై 21: అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు అచ్యుతాపురం మండలం పూడిమడక తీరంలో అలల ఉధృతి పెరుగుతుండడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. సముద్రం కూడా ముందుకు చొచ్చుకు రావడంతో పడవలు, వలలను తీరంలోని దూరంగా ఉన్న తమ ఇళ్ల వద్దకు తెచ్చుకున్నారు. తాజా వాతావరణం నేపథ్యంలో బుధవారం నుంచి వీరు వేటకు వెళ్లలేదు. పరిస్థితులు అనుకూలంగా ఉంటే సోమవారం ఉదయం నుంచి వేటకు వెళ్లాలని భావిస్తున్నారు. ఆదివారం రోజంతా మండలంలో ముసురు వాతావరణం నెలకొంది. సాయంత్రం ఐదు గంటల తర్వాత కాస్త తెరిపిచ్చినట్టు కనిపిస్తోంది.

'తాండవ'లో పెరుగుతున్న నీటి నిల్వలు

నాతవరం, జూలై 21: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయర్‌లో నీటినిల్వలు పెరుగుతున్నాయి. తాండవ గరిష్ఠనీటి మట్టం 380 అడుగులు కాగా, ఆదివారం నాటికి తాండవలో 367 అడుగుల నీటినిల్వలకు చేరింది. దీంతో తాండవ ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది తాండవ ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో ద్వారా తాండవలోకి 2291 క్యూసెక్కుల నీరు వస్తోందని తాండవ డీఈ అనురాధ తెలిపారు. గత ఏడాది జూలై 21 నాటికి తాండవలో 369 అడుగుల నీటినిల్వలు ఉన్నాయి. ఈ వర్షాలకు తాండవలో మరింత నీటినిల్వలు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.



నిండు కుండను తలపిస్తున్న తాండవ నది

మా మొర ఆలకించండి ప్రభో..

» అర్ల పంచాయతీలోని 4 గ్రామాల గిరిజనుల మొర

» కనీస సౌకర్యాలు లేక అల్లాడుతున్నామంటూ ఆవేదన

» 27వ తేదీలోగా పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామంటూ హెచ్చరిక


కొయ్యూరు/రోలుగుంట, జూలై 21: కొయ్యూరు, రోలుగుంట మండలాల్లోని మూలపూట, అర్ల పంచాయతీల శివారు పెదగరువు, పిత్రిగెడ్డ, నీళ్ల బంధ, జాజుల బంధ గ్రామాలకు చెందిన గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. తమ గ్రామాలకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నీళ్ల బంధ గ్రామానికి ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఈ నాలుగు గ్రామాల గిరిజనులు ఆరు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ రేషన్ బియ్యం తెచ్చుకోవాలన్నా, అంగన్‌వాడీ సరుకులు, వైద్య సేవలను పొందాలన్నా రానుపోను 18 కిలోమీటర్లు నడవాల్సిందే అన్నారు. ఆయా గ్రామాల్లో 100 కుటుంబాలకు చెందిన 250 మంది పీవీటీజీ తెగకు చెందిన గిరిజనులు నివస్తున్నారని తెలిపారు. వీరు నేటికీ కనీస సౌకర్యాలు లేక దుర్భర స్థితిని అనుభవిస్తున్నారన్నారు. 2021 సంవత్సరంలో కుటుంబానికి 300 చొప్పున చందాలు వేసుకుని అర్ల నుంచి జాజులబంధ వరకు మట్టిరోడ్డును ఏర్పాటు చేసుకున్నారన్నారు. అనేక పోరాటాల ఫలితంగా 2023లో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసినా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. దీంతె అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఈ నెల 27లోగా రోడ్డు పనులు ప్రారంభించి పూర్త చేయాలని, లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తాంబేలి కొండలరావు, కె.కొండబాబు, కిల్లో నరసయ్య పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చుని వేడుకుంటున్న గిరిజనులు

గరిష్ఠ స్థాయికి పెద్దేరు

సామర్థ్యం 137 మీటర్లు » ప్రస్తుతం 136.40 మీటర్లు



నిండుకుండలా పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్, జూలై 21: మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయానికి వరదపోటు నెలకొంది. జలాశయం పరిసరాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరింది. దీంతో జలాశయం నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కాగా ఆదివారం సాయంత్రానికి 500క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.40 మీటర్లకి చేరిందని జలాశయం ఏఈసుధాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు 300క్యూసెక్కులు జలాశయం గేటు తెరిచి విడిచిపెడతామని ఆయన తెలిపారు.

నిండు కుండలా కోణాం జలాశయం





కళకళలాడుతున్న కోణాం జలాశయం (ఇన్‌సెట్‌లో) కోణాం జలాశయం స్పిల్‌వే గేట్లు వద్ద చేరిన నీరు

చీడికాడ, జూలై 21: తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోణాం జలాశయ పరీవాహక ప్రాంతం ద్వారా 350 క్యూసెక్కులు వరద నీరు చేరడంతో జలాశయం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం సాయంత్రానికి 99 మీటర్లకు చేరుకుంది. 100 మీటర్లకు ఏ మాత్రం పెరిగినా నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే రోజుకు 96.70 మీటర్లు వద్ద ఉంది. ఎగువ, దిగువ గేట్లు నుంచి వృథాగా నీరు బొడ్డేరులోకి పోతోంది.

లక్షలు ఖర్చు చేసినా.. మూన్నాళ్లకే మూత!

» రాంబిల్లిలో నిరుపయోగంగా ఫ్యాషన్ టెక్నాలజీ, ఉత్పత్తి కేంద్రం భవనం

» చుట్టూ తుప్పలు పెరగడంతో అడుగు పెట్టలేని దుస్థితి

» గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నెరవేరని లక్ష్యం



భవనం చుట్టూ పెరిగిన తుప్పలు

రాంబిల్లి, జూలై 12: మండల కేంద్రం రాంబిల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో నిర్మించిన ఫ్యాషన్ టెక్నాలజీ, ఉత్పత్తి కేంద్రం భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం దీని చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో అడుగుపెట్టలేని విధంగా తయారైంది. కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం స్వర్ణ జయంతి గ్రామ సరోజ్‌గార్ యోజన పథకంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ భవనాన్ని ఇక్కడ నిర్మించింది. అప్పట్లో ఈ భవనం కొంతకాలం పాటు నిరుపయోగంగా ఉండేది. దీంతో ఓ ప్రైవేటు వ్యక్తి ఇందులో ఫ్యాషన్ టెక్నాలజీని ఏర్పాటు చేశారు. రాంబిల్లి పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఇందులో పనిచేశారు. ఇది కూడా కొద్ది రోజులు మాత్రమే పనిచేసింది. ఈ తరువాత మూతపడడంతో భవనం పూర్తిగా నిరుపయోగంగా ఉంది. దీనిని పట్టించుకునేవారు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని ఇలా నిరుపయోగంగా వదిలేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ఫ్యాషన్ టెక్నాలజీ, ఉత్పత్తి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని గత ప్రభుత్వాలు కనీస ఆలోచన చేయలేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఉన్నతాధికారులు దీనిపై ఇప్పటికైనా స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



రాంబిల్లిలో నిరుపయోగంగా ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ, ఉత్పత్తి కేంద్రం భవనం

పెరిగిన శారదా నది ఉధృతి



అనకాపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న శారదానది

అనకాపల్లి టౌన్, జూలై 21: శారదానది ఇక్కడ ఉధృతంగా ప్రవహిస్తుంది. రెండు రోజుల క్రితం వరకు సాధారణ నీటి ప్రవాహంతో ఉన్న నది ఆదివారం నిండుకుండలా మారింది. ఘాట్ నిండిపోవడంతో పాటు మెట్ల వద్దకు నీరు చేరింది. అనకాపల్లిలోనే కాకుండా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో పాటు రిజర్వాయర్ల గేట్లు ఎత్తడంతో వరదనీరు నదిలోకి చేరడంతో నీటి ఉధృతి పెరిగింది.

భారీ వర్షాలకు నిండిన జలాశయాలు



ఏఎల్‌పురం వర్షాలకు పొంగిప్రవహింస్తున్న బొడ్డేరుగెడ్డ

కృష్ణాదేవి పేట, జూలై 21: భారీ వర్షాలకు బొడ్డేరు, గెడ్డలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా ఏఎల్‌పురం, చోద్యం, కొంగసింగి, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో భారీ వర్షం పడింది. రహదారుల మధ్యలో ఉన్న గోతుల్లో వర్షం నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు ట్రాక్టర్లతో వరినాట్లు వేసేందుకు దమ్ములు ప్రారంభించారు.

చదరంగం పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 21: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి సాయి శక్తి టెక్నో స్కూల్‌లో జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఇరవై మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-11 బాలుర విభాగంలో ఎం.లిఖిత్ (పరవాడ), శివధీరజ్ (అనకాపల్లి) ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. బాలికల విభాగంలో సహస్ర (ఎస్.రాయవరం), గీతికా శ్రీ (అనకాపల్లి) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్టు అసోసియేషన్ అధ్య క్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. వీరంతా ఈ నెల 27,28 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. విజేతలకు స్కూల్ కరస్పాండెంట్ అన్నం రాజశేఖర్, శ్రీదివ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వుడా రాము, గురుమూర్తి, కోచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో విరబూసిన బ్రహ్మకమలాలు



కృష్ణాదేవి పేట, జూలై 21: హిమాలయాల్లో పూసె బ్రహ్మకమలాలు ఏఎల్‌పురంలోని ఎస్.వాసు మాష్టారు ఇంటి పెరట్లో కనువిందు చేస్తున్నాయి. శివుడికి ఎంతగానో ఇష్టమైన ఈ పుష్పాలు ఏడాదిలో ఒకసారి మాత్రమే పూస్తాయి. పలువురు భక్తులు పూజలు చేస్తారు. వాసు మాస్టారు ఇంట్లో పూచిన ఈ పుష్పాలను చూసి స్థానికులు మురిసిపోతున్నారు.

అసెంబ్లీ సమావేశాల డుమ్మాకే జగన్ ఢిల్లీ ధర్నా

» మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



అనకాపల్లి టౌన్, జూలై 21: పదవి పోయిన నాటి నుంచి తేరుకోలేని జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఏకంగా రాష్ట్రపతి పాలన పెట్టాలని పార్లమెంట్‌లో డిమాండ్ చేయమని తన ఎంపీలకు ఆదేశాలు జారీ చేయడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ఆదివారం ఇక్కడి తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను సింహం అని, ఒంటరిగానే పోటీ చేస్తానని ప్రగల్భాలు పలికిన జగన్‌కు ఇప్పుడు ఇతర రాజకీయ పార్టీలు జ్ఞాపకం వచ్చాయా.. అని ప్రశ్నించారు. ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు తనతో కలిసి రమ్మని ప్రాధేయపడుతున్నారన్నారు. సోమవారం నుంచి జరగబోయే శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర సమస్యలు గురించి చర్చించే అవకాశం వదులుకుని సమావేశాలకు డుమ్మా కొట్టడానికే 24న ఢిల్లీలో ధర్నా కార్యక్రమం పెట్టారని పేర్కొన్నారు. రాజభోగాలకు అలవాటుపడిన జగన్ ప్రతిపక్షంలో కూర్చోలేరన్నారు. తన పాలన పట్ల విపరీతమైన కక్షతో, అసహ్యంతో ప్రజలు అతి దారుణంగా ఓడిస్తే అందుకు కారణం తెలుసుకోవడానికి బదులు జగన్ హిమాలయాలకు వెళ్లిపోవాలని అనుకున్నారని ఎద్దేవా చేశారు. హుందాగా ప్రవర్తించి రాష్ట్ర ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఢిల్లీ వీధుల్లో పరిహాసం చేయవద్దని వీరభద్రరావు ఆయనకు హితవు పలికారు.

ఓ గిరిజనుడు ఖాతాలో నగదు చోరీ

గూడెంకొత్తవీధి, జూలై 21: మండలంలోని మెండిగెడ్డ పంచాయతీ తోటలగంది గ్రామానికి చెందిన కందుల మనోహర్‌నాథ్ ఖాతాలో నగదును సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. రెండు రోజుల క్రితం బ్యాంక్ ఉద్యోగినంటూ ఓ అజ్ఞాత వ్యక్తి కాల్ చేసి హిందీలో మాట్లాడడంతో హర్‌నాథ్ కాల్ కట్ చేసేశాడు. అయితే అతని మొబైల్‌కు రెండు ఓటీపీలు వచ్చాయి. వెంటనే రూ.9,600 డెబిట్ అయినట్టు మరో మెసేజ్ వచ్చింది. బ్యాంక్‌కు వచ్చి మినీ స్టేట్‌మెంట్ తీసుకోగా నగదు డెబిట్ అయినట్టు చూపడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నారు మడుల్లో వర్షపు నీటిని తొలగించాలి

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు


మునగపాకలో వరి నారుమడులను పరిశీలిస్తున్న మోహన్‌రావు

మునగపాక (తుమ్మపాల), జూలై 21 : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి నారుమడుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించే ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి డి.మోహన్‌రావు రైతులకు సూచించారు. మునగపాకలో వరి నారుమడులను వ్యవసాయాధికారులతో ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలు ఖరీఫ్ సీజన్‌కు మేలు కలిగిస్తాయన్నారు. అయితే వరి నారు మడులకు తెగుళ్ల సోకే ప్రమాదముందని వివరించారు. వరి నారుమడుల్లో నీటిని తొలగించి రెండు కిలోల యూరియా, కిలో పొటాష్ ఎరువులను ఐదు సెంట్ల నారుమడుల్లో చల్లుకోవాలని సూచించారు. జింక్ లోపం గమనిస్తే రెండు మిల్లీలీటర్ల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ముసురు వాతావరణం

అనకాపల్లి టౌన్, జూలై 21 : అల్పపీడనం కారణంగా అనకాపల్లి పరిసరాల్లో ఆదివారం ముసురు వాతావరణం నెలకొంది. వేకువజామున నాలుగు గంటల నుంచి చినుకులు పడుతూనే ఉన్నాయి. వర్షపాతం 24.0 ఎంఎంగా నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మధ్యాహ్నం పన్నెండున్నర గంటల వరకు ఎడతెరిపి లేకుండా చినుకులు పడడంతో రోడ్లపైకి రావడానికి జనం ఇబ్బందులు పడ్డారు. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. రోడ్లు చిత్తడిగా మారాయి.

సర్వాంగ సుందరంగా అచ్యుతాపురం జంక్షన్


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, జూలై 21 : పారిశ్రామిక ప్రాంతానికి ముఖద్వారమైన అచ్యుతాపురం జంక్షన్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం ఈ జంక్షన్‌లో ఏపీఐఐసీ ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లను ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ గత ఐదేళ్లలో అచ్యుతాపురం గురించి పట్టించుకోలేదన్నారు. రోడ్డు విస్తరణకు ఏర్పాట్లు జరిగి, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించినా వైసీపీ నాయకుల ఒత్తిడి వల్ల అచ్యుతాపురం జంక్షన్‌లో భవనాలు తొలగించలేదన్నారు. ప్రస్తుతం తాము భవనాలు తొలగించి, రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం చేశామన్నారు. ఇదిలావుంటే, మడుతూరులో ప్రమాదంలో గాయపడిన జనసేన క్రియాశీలక సభ్యులకు రూ.50 వేలు ప్రమాద భీమాను ఎమ్మెల్యే అందజేశారు. తహసీల్దార్ సరోజిని, నాయకులు బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, దిన్‌బాబు, మోటూరు శ్రీవేణి, ద్వారపురెడ్డి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

గోకివాడ ఆనకట్టను పరిశీలించిన ఎమ్మెల్యే

రాంబిల్లి : నదీ పరీవాహక ప్రాంతాల్లో నివాసముండే ప్రజలంతా వర్షాలు పడుతున్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయకుమార్ సూచించారు. ఆదివారం మండలంలోని గోకివాడ ఆనకట్టను సానిక నేతలు, నీటి పారదల శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఆనకట్ట నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో అధికారులకు పలు సూచనలు చేశారు. నీటిపారుదల శాఖ ఏఈ చిన్నారావు, నాయకులు అల్లవరపు బాబ్జీ, సన్యాసిరావు, వేగి రాము, బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పులకించిన సింహగిరి

... 5వ పేజీ తరువాయి

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, తదితరులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవం విజయవంతం కావడానికి కృషి చేశారు.

సేవలందించిన 45 ఆర్టీసీ బస్సులు

దేవస్థానం సుమారు రూ.10 లక్షలు చెల్లించి 45 ఆర్టీసీ బస్సులను భక్తుల రాకపోకలకు వినియోగించింది. అవన్నీ రద్దీగా మారడంతో కొందరు ఘాట్‌రోడ్డులో కాలినడకన రాకపోకలు సాగించారు. తొలిపావంచా వద్ద భక్తులు లక్షలాదిగా కొబ్బరికాయలను కొట్టి ప్రదక్షిణలను ప్రారంభించడంతో టన్నుల కొద్దీ కొబ్బరిముక్కలు పోగయ్యాయి. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కాంట్రాక్టర్ వ్యాన్‌లు ఏర్పాటు చేసి, జేసీబీ సాయంతో వాటిని ఎప్పటికప్పుడు తరలించారు.

జీవీఎంసీలో రాజకీయ చదరంగం

... 5వ పేజీ తరువాయి

నిర్వహించాల్సి ఉంది. సాధారణ ఎన్నికల హడావిడి, తరువాత కమిషనర్ బదిలీ వంటి పరిణామాలతో నాలుగు నెలలుగా స్టాండింగ్ కమిటీ సమావేశం జరగలేదు. దీంతో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, రోజువారీ ఖర్చులకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీకి వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి, సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో వచ్చేనెల ఏడున స్టాండింగ్ కమిటీకి ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్, ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ హరేంధిర ప్రసాద్ సోమవారం దీనికి సంబంధించి ప్రకటన చేసే అవకాశం ఉంది.

అప్రమత్తమైన కూటమి నేతలు

స్టాండింగ్ కమిటీ ఎన్నిక నేపథ్యంలో కూటమి నేతలు అప్రమత్తమయ్యారు. సాధారణ ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేయడంతో జీవీఎంసీ మేయర్ పీఠంతో పాటు స్టాండింగ్ కమిటీని కూడా కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. దీని కోసం కౌన్సిల్‌లో బలం పెంచుకునే చర్యలు ప్రారంభించారు. జీవీఎంసీలో ప్రస్తుతం వైసీపీకి 59 మంది కార్పొరేటర్లు, టీడీపీకి 29 మంది, జనసేనకు ఐదుగురు కార్పొరేటర్ల బలం ఉంది. వీరుకాకుండా బీజేపీ, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు, ఇండిపెండెంట్‌గా ఒకరు ఉన్నారు. తాజాగా ఆదివారం 12 మంది కార్పొరేటర్లు వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. వీరిలో ఏడుగురు టీడీపీలో, ఐదుగురు జనసేనలో చేరిపోయారు. దీంతో టీడీపీ బలం 36కి, జనసేన బలం పదికి మొత్తంగా బీజేపీతో కలుపుకుంటే కూటమి బలం 47కి పెరిగింది. అదే సమయంలో వైసీపీ బలం 47కి తగ్గిపోయింది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉండగా, ఒక్కస్థానం దక్కించుకోవాలంటే 97 మంది కార్పొరేటర్లలో కనీసం 49 మంది మద్దతు అవసరం. అంటే ఇరుపక్షాలకు మరో ఇద్దరు సభ్యులు మద్దతు కావాలి. ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ప్రస్తుతం వైసీపీకి మద్దతు ఇస్తుండగా, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ల నిర్ణయం కీలకంగా మారనుంది.. వీరిద్దరూ కూటమికి మద్దతు తెలిపితే కూటమి అభ్యర్థులు, ఒకవేళ వైసీపీకి మద్దతిస్తే వైసీపీ సభ్యులు స్టాండింగ్ కమిటీలో విజయం సాధిస్తారు. ఈ నేపథ్యంలో మరో పది మంది కార్పొరేటర్లను చేర్చుకునే దిశగా కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. వారంతా వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేలు, వార్డులోని నేతలు, కార్యకర్తల అభ్యంతరాల నేపథ్యంలో తీసుకోలేదని ప్రచారం జరుగుతోంది. అభ్యంతరాల్లేని కార్పొరేటర్లలో కనీసం పది మందిని చేర్చుకుంటామని కూటమి నాయకులు ప్రకటించడంతో వైసీపీ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పుడున్న 47 మంది కార్పొరేటర్లు చేజారిపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహరచన చేస్తున్నారు. కొత్తగా కార్పొరేటర్ల చేరికల నేపథ్యంలో టీడీపీ, జనసేన కార్పొరేటర్లలో నెలకొన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని యత్నిస్తున్నారు. వారి మద్దతుని రాబట్టుకోవడం ద్వారా స్టాండింగ్ కమిటీలో సగం స్థానాలైనా కాపాడుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

సబ్బవరం, జూలై 21 : మండలంలోని ఇరువాడలో గల కృపా సహకార కేంద్రంలో ఆదివారం గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు నిరు పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. విజయ్ భాస్కర్, మౌనిక, పాస్టర్ స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

వాన కురిస్తే.. నరకమే!

▸▸ అనకాపల్లి పట్టణంలో పలు రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో రాకపోకలకు జనం ఇబ్బందులు
▸▸ ఒక రోజు వర్షం పడితే నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లులో ఆరు మాసాలు మురుగు బెడద
▸▸ గత ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు ▸▸ నిట్టూర్చుతున్న నివాసితులు


అనకాపల్లిలోని గూడ్స్‌షెడ్డు వద్ద రహదారి దుస్థితి

అనకాపల్లి టౌన్, జూలై 21 : జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలోని పలు రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడికక్కడ గోతులు పడడంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత దర్భరంగా తయారయ్యాయి. ఆయా గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే రైల్వేస్టేషన్, భీమునిగుమ్మం, రింగురోడ్డుకు వెళ్లే మార్గంతో పాటు ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన నూకాంబిక ఆలయానికి సమీపంలో రహదారి అధ్వానంగా మారడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గూడ్స్‌షెడ్డు వద్ద పడిన గొయ్యిని స్థానికులు అడపాదడపా మట్టితో కప్పినప్పటికీ క్రమేపీ ఆ మట్టి తొలగిపోవడం వల్ల గొయ్యి మరింత పెద్దదై రైల్వే స్టేషన్‌కు వచ్చి వెళ్లే ప్రయాణికులతో పాటు రింగురోడ్డు మీదుగా మెయిన్ రోడ్డుకు వెళ్లే ప్రయాణికులకు సైతం అవస్థలు తప్పడం లేదు. అలాగే భీమునిగుమ్మం స్కూల్ వద్ద రోడ్డుకు మధ్యలో గొయ్యి పడింది. ఈ మార్గంలోనే విద్యాసంస్థలు ఉన్నాయి. విద్యార్థులు కూడా రాకపోకలు సాగించేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. నూకాంబిక అమ్మవారి ఆలయానికి అతి సమీపంలోని మరిడిమాంబ ఆలయానికి వెళ్లే జంక్షన్‌లో రహదారి ఛిద్రంగా మారింది. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో రోడ్లు ఇలా తయారయ్యాయని అంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు పెద్దవీధిలో నిలిచిన వర్షపు నీరు


నూకాంబిక ఆలయ సమీపంలో...


భీమునిగుమ్మం స్కూల్ వద్ద...


చినదొడ్డిగల్లులో మరో వీధిలో దుస్థితి

నీరు కదలదు.. దుర్వాసన వీడదు

నక్కపల్లి, జూలై 21 : ఎక్కడైనా భారీ వర్షం పడితే రెండు లేదా మూడు రోజులు వీధుల్లో నీరు నిల్వ ఉండడం సహజం. కానీ నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామంలోని పెద్దవీధిలో మాత్రం ఒక రోజు వర్షం పడితే ఆరు నెలలు వరకూ ఆ నీరు నిలిచిపోతుంటుంది. గత ఎనిమిదేళ్ల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపలేకపోతున్నారు. పెద్దవీధి, బడ్డివీధి తదితర కాలనీలకు చెందిన ప్రజలు, విద్యార్థుల ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడం, డ్రైన్లు లేకపోవడం శాపంగా మారింది. రహదారికి ఇరువైపులా అనేక గృహ సముదాయాలున్నాయి. ఎవరైనా సరే ఈ వీధిలో ఇంటి నుంచి బయటకు రావాలంటే కచ్చితంగా ఈ మురుగులో కాలు పెట్టాల్సిందే. పిల్లలు పాఠశాలలకు వెళ్లేటప్పుడు కూడా నరకయాతన పడుతున్నారని మహిళలు చెప్పారు. ఈ రహదారి చివరన కొందరు రైతుల పంట పొలాలున్నాయి. పాముల బెడద కూడా ఎక్కువగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ నీటిని గనుక అటువైపు మళ్లిస్తే రైతుల పంటపొలాలన్నీ దెబ్బతింటాయని కొందరు చెబుతున్నారు. డ్రైన్లు నిర్మించి, గ్రామంలో ఉన్న ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తే తప్ప, ఈ సమస్య పరిష్కారం కాదని పలువురు చెబుతున్నారు. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామస్థులంతా కోరుతున్నారు.


రాంబిల్లి : అప్పన్నపాలెంలో సాయిబాబాకు ప్రగడ నాగేశ్వరరావు తదితరుల పూజలు


ఎస్.రాయవరం : రేవుపోలవరం సముద్ర తీరం వద్ద ఉన్న ఆలయంలో...


విశేష అలంకరణలో సబ్బవరం మండలం దేవీపురంలో సహస్రాక్షి రాజరాజేశ్వరి అమ్మవారు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు


అనకాపల్లి మండలం వెంకుపాలెంలో దత్తాత్రేయుని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్


ఎలమంచిలి సాయిబాబా ఆలయంలో...


మునగపాక మండలం తోటాడలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 21 : గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం వాడవాడలా అత్యంత ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధిలో గల వరహా లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకుడు మళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పార్కు జంక్షన్ వద్ద గల సత్యసాయి మందిరంలో షిర్డీసాయిబాబాకు టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తూరు : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఎన్‌జీవో కాలనీ, వెంకుపాలెం తదితర గ్రామాల్లో గురుపూజోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెంకుపాలెం శారదానది ఒడ్డున ఉన్న దత్తాత్రేయస్వామికి టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఉపాధ్యాయులు ఆడారి రామారావు, ఆడారి సూర్యనారాయణ, వజ్జుల బాలకృష్ణలను సత్కరించారు. అలాగే, ఎన్‌జీవో కాలనీలో షిరిడి సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. దాడి రత్నాకర్‌తో పాటు షిరిడీ సాయిబాబా ఆలయ వ్యవస్థాపకులు ఆళ్ల అప్పలనాయుడు, ఎన్‌జీవో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట రామారావు, రామసత్యనారాయణ, కోశాధికారి ఎంఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : చింతలపాలెం సాయిబాబా ఆలయంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, నర్సింగబిల్లి సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : గురుపౌర్ణమి పర్వదినాన్ని ఆదివారం పాయకరావుపేట ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ జరుపుకున్నారు. పట్టణంలోని బృందావనం దుర్గాలమ్మచెట్టు ఆలయ ఆవరణలో ఉన్న షిర్డిసాయి మందిరంలో సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అదేవిధంగా పాండు రంగస్వామి ఆలయం, సాయి ఆదర్శనగర్, లింగాలతోట కాలనీలోని ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న సాయిబాబా మందిరంలోనూ ఈ వేడుకను నిర్వహించారు.

పాయకరావుపేట రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కందిపూడి, మంగవరం, శ్రీరాంపురం, సత్యవరం, అరట్లకోట తదితర గ్రామాల్లో గల సాయిబాబా ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలపట్నం సమీపంలోని సీతమ్మవారి కొండ చుట్టూ వివిధ గ్రామాలకు చెందిన భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు.

ఎస్. రాయవరం : గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న షిర్డీ సాయి బాబా ఆలయాలు ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. ఎస్.రాయవరం, రేవుపోలవరం, జేవీపాలెం, దార్లపూడి తదితర గ్రామాల్లో ఉన్న ఈ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

ఎలమంచిలి : గురుపూజోత్సవాన్ని మునిసిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల సాయిబాబా ఆలయంతో పాటు యర్రవరం బైపాస్ రోడ్డు వీధిలోని సాయినాథుని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అలాగే, కొక్కిరాపల్లి, పెదపల్లి, సోమలింగపాలెం, తెరువుపల్లి, ఏటికొప్పాక, రేగుపాలెం, పులపర్తి, పీఎస్ఆర్‌పేట, గ్రామాల్లో కూడా ఈ వేడులను జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మునగపాక (తుమ్మపాల) : గురుపౌర్ణమి సందర్భంగా మునగపాక మండలంలో తోటాడ ఆదినారాయణస్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గిరి ప్రదక్షిణ నేత్రపర్వంగా సాగింది. ఓంకార పీఠం నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ త్రిమూర్తుల ఆలయం, మూలపేట, పాటిపల్లి కాలనీ, నారాయుడుపాలెం మీదుగా ఆశ్రమం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర సాగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అమ్మవారి భజనలు, గీతాలతో ఆహ్లాదకరంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు.

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అప్పన్నపాలెంలో సాయిబాబా ఆలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు స్థానిక నాయకులతో కలిసి పూజలు జరిపారు. పంచదార్ల, కొత్తూరు, దిమిలి, పెదకలవలాపల్లి సాయిబాబా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

సబ్బవరం : మండలంలోని దేవీపురంలో గురుపౌర్ణమి వేడుకలను గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. యంత్ర మహామేరులో శతచండీ పారాయణం, దక్షవటిలో ఏర్పాటు చేసిన 27 గుండాల వద్ద వంద మంది భక్తులు చండీ పారాయణంతో పాటు శతచండీహోమం జరిపారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యాట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమ్యతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మండల కేంద్రం సబ్బవరంలో గల సాయిబాబా ఆలయంలో ఈ వేడుకలు మరింత ఘనంగా జరిగాయి. ఎంపీటీసీ-2 బైలపూడి దేముడుబాబు, అరుణ దంపతులు బాబాకు రూ. లక్షా మూడు వేలు విలువ చేసి ముత్యాలహారాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు, బర్ల రమణ, కొరాడ శ్రీను, గెడ్డం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సత్కారం


యోగా గురువులను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు, జూలై 21 : అనకాపల్లి పట్టంలోని జార్జిక్లబ్, భారత్ స్వాభిమాన ట్రస్టు పతంజలి యోగా ఆధ్వర్యంలో గురువులకు ఆదివారం సత్కారం చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యోగా గురువులు జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు, కార్యదర్శి మంగయ్య మాట్లాడారు. ప్రకృతి ఫలహారాలను భుజిస్తూ, ప్రకృతిని ఆరాధించి శ్వాసపైనే ధ్యాసను ఉంచుతూ ఓంకార నామాన్ని జపిస్తూ ఉండాలన్నారు. నిర్వాహకులు బీఎస్ఎంకే జోగినాయుడు, కోలపర్తి కన్నబాబు, బి.శ్రీనివాసరావు, సభ్యులు కొణతాల శివాజీ, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, ఆళ్ల సూర్య, రామకృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : వ్యాస వాఙ్మయమే సనాతన ధర్మానికి మూలమని గాంధీనగరం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు రేజేటి గోపాలప్పలాచార్యులు (చక్రవర్తి) అన్నారు. అంజయ్యకాలనీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆయన గురుపౌర్ణమి విశిష్టతను భక్తులకు తెలిపారు. వ్యాస మహర్షి గురువు అన్న పదానికి ఆద్యుడని, ఆయనే బ్రహ్మరూపమని వివరించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆయనను సత్కరించారు. ఓబుల్‌రెడ్డి లక్ష్మి, యల్లపు శ్రీవాణి, కోడూరు పాపాయి, రాళ్లపల్లి మంగావతి, యల్లపు దుర్గ తదితరులు పాల్గొన్నారు.


అర్చకులు చక్రవర్తికి సత్కారం

శ్రీవారి ఆలయంలో విశేష పూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 21 : దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాలు ఐదవ రోజు ఆదివారం నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పులకండం విజయబాబు, గిరిబాబుల ఆధ్వర్యంలో ఆలయ మండపంలో వేదపండితులు స్వామివారికి తెల్లవారుజామున ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు, హోమాలు, శ్రీవారికి బేడా సేవ నిర్వహించారు. ఆలయ ఈవో రాజ సులోచన, ఆలయ పర్యవేక్షకులు సకల గోవిందరావు, పులకండం ప్రసాద్‌బాబు, రాజేష్‌బాబులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా యానాద్రి అమ్మవారి జాతర


అమ్మవారికి మహిళలు పూజలు

ఎలమంచిలి, జూలై 21 : మునిసిపాలిటీలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో ఆదివారం యానాద్రి అమ్మవారి జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వర్షాన్ని సైతం లెక్కచేయక పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పసుపు కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. సాయంత్రం జరిగిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు.

644 ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

పరవాడ, జూలై 21 : విశాఖ కలెక్టర్ ఆఫీస్ నుంచి జాజులవానిపాలెం, పి.బోనంగి మీదుగా వెన్నెలపాలెం వరకు రూట్ నంబరు 644 ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని పి.బోనంగి గ్రామస్థులు కోరుతున్నారు. సర్వీసు లేదన్న సాకుతో ఆర్టీసీ అధికారులు బస్సును అర్ధంతరంగా నిలుపుదల చేశారని, దీనివల్ల తామంతా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. బస్సు సర్వీసు లేకపోవడం వల్ల పి.బోనంగి, వీఎల్ఎన్ పురం, కలపాక, కలపాక బీసీ కాలనీ, స్వయంభూవరం, వెన్నెలపాలెం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులతో పాటు కార్మికులు, ఉద్యోగులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యపై సదరు అధికారులు వెంటనే స్పందించాల్సిందిగా కోరుతున్నారు.

లాలం భాస్కరరావుకు నివాళి


భాస్కరరావు చిత్రపటం వద్ద టీడీపీ శ్రేణుల నివాళి

అచ్యుతాపురం, జూలై 21 : టీడీపీ సీనియర్ నాయకుడు లాలం భాస్కరరావు జయంతిని ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దిబ్బపాలెం మాజీ ఎంపీటీసీ లాలం రాజు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ అవసరం

రాంబిల్లి, జూలై 21 : వరినారుమళ్లు తెగుళ్లబారిన పడకుండా రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బీసీటీ కృషివిజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బి.నాగేంద్రప్రసాద్ సూచించారు. వరినారుమడులు తయారు అనంతరం విత్తనం విత్తిన పదిరోజులకు వరినారుమళ్లలో లీటరు నీటికి 1.6 మిల్లీలీటరు చొప్పన మోనోక్రోటోఫాస్ లేదా క్లోరోపైరీపాస్ 2 మిల్లీలీటర్లు చొప్పన కలిపి పిచికారి చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బండారు


స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, జూలై 21 : ఎం.అమండలో ప్రజా సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం గ్రామంలో ఓ శుభ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డు గతుకుల మయంగా మారిందని, మరమ్మతులు చేయించాలని మాజీ సర్పంచ్ గొర్లె సన్యాసినాయుడు, మాజీ జడ్పీటీసీ పాత్రునాయుడు, గొర్లె గోవింద తదితరులు ఎమ్మెల్యేను కోరారు. ఎం.అలమండ నుంచి మామిడిపల్లి రోడ్డు పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తప్పనిసరిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జనసేన కార్యకర్తల కుటుంబాలకు
బీమా చెక్కుల అందజేత


సత్యనారాయణ, గణేష్ కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న నాగబాబు

కృష్ణాదేవిపేట, జూలై 21 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసైనికుడి కుటుంబానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఆదివారం పార్టీ తరుపున రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు. గొలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన జనసేన నేత అల్లు సత్యనారాయణ ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం మంగళగిరిపార్టీ కార్యాలయంలో పార్టీ ప్రధానకార్యదర్శి కొణిదెల నాగబాబు చేతుల మీదుగా మృతుడు భార్య అల్లు రాజ్యలక్ష్మికి రూ.5 లక్షల బీమా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల పార్టీ అధ్యక్షుడు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రేగుబల్ల సాంబశివ, సలాదుల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ములకలాపల్లికి చెందిన ఇంటి గణేష్ మృతి చెందడంతో రూ.ఐదు లక్షల చెక్కును ఆ కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆదివారం అందించారు. గణేషు పార్టీ సభ్యత్వం పొందిన గణేష్ ప్రమాదంలో మరణించడంతో బీమా కింద చెక్కును అందజేశారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావు

నర్సీపట్నం, జూలై 21 : ఎన్టీఆర్ మిని స్టేడియంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు అధ్యక్షతన ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నర్సీపట్నం వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఎన్నిక పరిశీలకులుగా విశ్రాంత ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జామ్మ వ్యవహరించారు. అధ్యక్షుడుగా చినబాబు, కార్యదర్శిగా కామిరెడ్డి సత్యనారాయణ, కోశాధికారిగా అల్లు అప్పారావు, ఉపాధ్యక్షులుగా కుప్పిలి స్వామి, ఎంవీ రంగారావు, సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా వాకాడ శంకర్‌రెడ్డి, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా బాబి, గౌరవ మహిళా సభ్యులుగా జయంతి వేదవల్లి, పాలిమార్ రాజేశ్రీ, గౌరవ సలహాదారులుగా చుక్కల రాము, ఊడా వెంకట్రావు, జేఎస్ఎస్ నాగేశ్వరరావు, డి.నూకరాజును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ మాట్లాడుతూ నర్సీపట్నం వాకర్స్ క్లబ్ స్థాపించి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు కార్యదర్శి ఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సెలవు దినాల్లో కార్యక్రమాలు తగదు : పీఆర్టీయూ


శిక్షా సప్తహ్ షెడ్యూల్ చూపిస్తున్న పీఆర్టీయూ నేతలు

నర్సీపట్నం, జూలై 21 : ప్రభుత్వ పాఠశాలలో సెలవు దినాల్లో కార్యక్రమాలు నిర్వహించ వద్దని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జి.రమేశ్ కోరారు. ఆదివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి శిక్షా సప్తహ్ కార్యక్రమంలో సామాజిక భాగస్వామ్య దినోత్సవం పేరుతో తల్లిదండ్రులు, విద్యా కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారం పెంపొందించడం, పుట్టిన రోజు వేడుకలకు సహపంక్తి భోజనాలు నిర్వహించాలని సమగ్ర శిక్షా డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఆ ఉత్తర్వులలో ఆదివారం సెలవు రోజు కూడా కార్యక్రమం నిర్వహించాలని పేర్కొనడం అన్యాయమన్నారు. ఆ కార్యక్రమాన్ని సోమవారానికి మార్చాలని సమగ్ర శిక్ష అధికారులను లేఖ ద్వారా కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ఉపాధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

చోడవరం, జూలై 21 : గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన అవసరమని ప్రముఖ వైద్యులు ఎం.గురువేంద్రనాయక్ తెలిపారు. ఆదివారం స్థానిక సంజీవిని ఆసుపత్రిలో గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్యాన్సర్ లక్షణాలపై అవగాహన లేకపోవడంతో చాలామంది గ్రామీణులు వ్యాధి ముదిరే వరకూ గుర్తించకుండా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు ఎం.ఎం. జోషి, ఎంఎల్ రావు, సుగుణేశ్వరి, చోడవరం సంఘం అధ్యక్షుడు అమిత్ కుమార్, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన ఆర్ఎంపీ వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం : రూ.2 రెండు లక్షల ఆస్తి నష్టం




మాడుగుల రూరల్, జూలై 21 : గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు అంటుకుని పూరిల్లు దగ్ధమైంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మాడుగులలోని తుడుము వీధిలో తూరిబిల్లి సంతోష్ కుటుంబం తాటాకు ఇంటిలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. సంతోష్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మూడున్నర గంటల సమయంలో టీ కాచేందుకు సంతోష్ భార్య గ్యాస్ సిలిండర్ వెలిగించగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన ఆమె కేకలు వేస్తూ ఇద్దరు పిల్లలతో బయటకు పరుగులు తీసింది. స్థానికులు మాడుగుల అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. మంటల్లో ఇల్లు, గృహోపకరణాలు కాలిపోయాయి. సిలిండర్ పేలకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి రాజేశ్వరరావు తెలిపారు. ఫైర్ సిబ్బంది రామారావు, మణికుమార్, మదీనా పాల్గొన్నారు.


కృష్ణాదేవిపేట : ఏఎల్‌పురం షిర్డీసాయిబాబా ఆలయం ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


నర్సీపట్నం : పూజలు చేస్తున్న పద్మావతి


చోడవరం : పూజల్లో పాల్గొన్న గోవాడ షుగర్స్ ఎండీ సన్యాసినాయుడు


బుచ్చెయ్యపేట : పూజలు అందుకుంటున్న బాబా


దేవరాపల్లి : ఆలయంలో సాయిబాబాకు పూజలు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- పలు చోట్ల అన్న సమారాధనలు

చోడవరం, జూలై 21 : మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వెంకన్నపాలెం గోవాడ షుగర్స్ షిర్డీసాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు దంపతులు పాల్గొన్నారు. ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు కేవీవీఎస్ భాస్కరరావు, ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, వర్మ, కార్మిక సంఘం నాయకులు నానిబాబు, శరకాన సన్నిబాబు, సన్యాసిరావు, పెంటారావు, దొడ్డి శ్రీను పాల్గొన్నారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై సాయినాధుని దర్శించుకున్నారు. పాత బస్టాండ్ ఆవరణలో వల్లంపాటి శ్రీనివాసరావు షాపు వద్ద గురుపౌర్ణమి సందర్భంగా ప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట : గురుపౌర్ణమి సందర్భంగా ఏఎల్ పురం, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట గ్రామాల్లోని షిర్డీసాయిబాబా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏఎల్‌పురంలో మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం : దుగ్గాడ, నర్సీపట్నం షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమిని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆదివారం ఆలయాల్లో సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు సాయిబాబాను దర్శించుకున్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు భార్య పద్మావతి, జడ్పీటీసీ సుకల రమణమ్మ బాబాని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెదిరెడ్ల చింతు, కార్యదర్శి డాక్టర్ వి. రామచంద్రరావురాజు, ట్రెజరర్ లంక ఈశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట : గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం విజయరామరాజుపేట, వడ్డాది సాయిబాబు ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, అర్చనలు, సామూహిక పారాయణం, ప్రత్యేక పూజలు చేసి గురువు గొప్పతనాన్ని చాటారు. విజయరామరాజుపేటలో ఆలయ వ్యవస్థాపకులు దొడ్డి వెంకట ముత్యాలు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా తిరువీధి ఉత్సవం నిర్వహించారు. విఘ్నేశ్వర, షిర్డీ సాయిబాబా, దత్తాత్రేయ ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించిన అనంతరం ఆలయంలో బాబావారికి ఉయ్యాల పవళింపు సేవను కనులపండువగా నిర్వహించారు.

కె.కోటపాడులో..

కె.కోటపాడు : మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకంతో మొదలై లక్ష ఎండు ద్రాక్ష ఫలాలతో స్వామివారికి అర్చన నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వేగి రామారావు, ఆలయ పురోహితులు రమేష్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రావికమతం : తట్టబందలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు


కె.కోటపాడు : లక్ష ఎండు ద్రాక్షలతో అర్చన

రావికమతంలో..

రావికమతం : మండలంలో పలు గ్రామాలలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఉదయం నుంచే సాయిబాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్తకోట, రావికమతం, తట్టబంద గ్రామాలలో షిర్డీసాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తట్టబందలో సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో గ్రామ యూత్,పెద్దలు భారీ అన్న సమారాధన చేశారు. కొత్తకోట, రావికమతంలో కూడా అన్న సమారాధనలు జరిగాయి.

రోలుగుంటలో..

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొమరవోలులోని స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చన పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పోతల శ్రీనివాసరావు, బోళెం రమేష్, తానార శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : మండలంలోని రైవాడ, తెనుగుపూడి, వాకపల్లి గ్రామాల్లో షిర్డీ సాయిరాం ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైవాడలో అన్నసమారాధన చేపట్టారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ లక్ష్మి, చల్లా తాతయ్యలు, నాయుడు, కేఎస్ అప్పలనాయుడు, జీటీవీ సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు. వాకపల్లిలో ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ జరిపించారు.

మాడుగులలో..

మాడుగుల రూరల్ : మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక దత్తాత్రేయపీఠంలో పురోహితులు భరణి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో సామూహిక పూజలు చేశారు. భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

తాచేరు డైవర్షన్ రోడ్డులో రవాణా పునరుద్ధరణకు చర్యలు

- అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ


అధికారులు, స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో

బుచ్చెయ్యపేట, జూలై 21 : బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట తాచేరు నదిపై రవాణా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులను అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ ఆదేశించారు. అలాగే డైవర్షన్ రోడ్డు పటిష్టతకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న తాచేరు డైవర్షన్ రోడ్డును ఆదివారం ఆయన పరిశీలించారు. కోణాం రిజర్వాయర్ నీరు విడుదల చేయడంతో నదీ ప్రవాహ ఉధృతి కారణంగా డైవర్షన్ రోడ్డుకు గండి పడిందన్నారు. దీంతోపాటు సీసీ పైపుల మధ్య గ్రావెల్ కొట్టుకుపోవడంతో డైవర్షన్ రోడ్డు దెబ్బతిందన్నారు. అలాగే ఇసుక బస్తాలతో గండి పూడ్చే పనులను అనకాపల్లి ఆర్ అండ్ బీ డీఈఈ ధనుంజయరావుతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. గండి పూడ్చడంతో పాటు సీసీ పైపుల మధ్య ఇసుక బస్తాలను వేస్తామని డీఈఈ వివరించారు. తాచేరుపై వంతెన నిర్మాణానికి ఎన్‌డీబీ నిధులు రూ.6 కోట్లు మంజూరైనట్టు ఆర్డీవోకు డీఈఈ తెలిపారు. వర్షాకాలం సీజన్ ముగిసిన వెంటనే వంతెన నిర్మాణ పనులు చేపట్టనున్నామన్నారు. వర్షాకాలంలో కాజ్‌వే దెబ్బతినకుండా పటిష్ట చర్యలు చేపట్టి, నిలిచిన రవాణాను పునరుద్ధరించాలని ఆర్డీవో చిన్నికృష్ణ ఆదేశించారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ కరువు తీర్చిన వర్షం

- రైతుల్లో ఆనందం


చోడవరంలో కురుస్తున్న వర్షం

గొలుగొండ, జూలై 21 : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం పడింది. దీంతో పాతమల్లంపేట, పాకలపాడు, ఎర్రవరం,కొత్తఎల్లవరం, జోగంపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో గల చెరువులు నిండాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగు నీటికి కొరత లేకుండా వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తుపాను కారణంగా కురిసిన వర్షాలకు వరి నారుమడులు నీటమునిగాయి. దీంతో రైతులు వరినారుమడుల్లో నీటిని తొలగించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అలాగే ధారగెడ్డ, గొరిగెడ్డ, పాలగెడ్డ, రాళ్లగెడ్డలు పొంగాయి.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం : తుపాన్ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మాకవరపాలెం, తామరం,కొండలఅగ్రహారం, గిడుతూరు, మల్లవరం తదితర గ్రామాల్లో రైతులు దమ్ములు ప్రారంభించారు. సాగునీటి కాలువులు, చెరువులు పూర్తిగా నీటితో నిండాయి. గిడుతూరు, జి.వెంకటాపురం, రామన్నపాలెం రోడ్లు మధ్యలో ఉన్న గోతుల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పానది, వరహానదిలోకి భారీగా వర్షం నీరు చేరుతుండడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

చోడవరంలో..

చోడవరం : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఆదివారం కూడా వర్షం కొనసాగింది. ఆదివారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. శనివారం రాత్రి వర్షం తగ్గినప్పటికీ, ఆదివారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉండడంతో ముసురు వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి పలుచోట్ల పంటభూముల్లోనికి వాన నీరు బాగా చేరింది.

రావికమతంలో..

రావికమతం : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెరువులు, వాగులు వరద నీటితో నిండి కళకళలాడుతున్నాయి.్ఎలు గ్రామాల లోతట్టు ప్రాంతాల్లో వరి నారు మడులలో నీరు చేరింది. ఆదివారం ఉదయం నుంచి ఏకదాటిగా 22.8 మిల్లీమీటర్ల వరపాతం నమోదైంది. పొలాల్లో నీరు అధికంగా ఉండడంతో వరి నారు నాట్లు వేసేందుకు ఎదగక రైతులు దమ్ములు ప్రారంభించలేదు.

బురదలో చిక్కుకుంటున్న వాహనాలు



మాడుగుల రూరల్, జూలై 21 : ఘాట్‌రోడ్డు జంక్షన్ - కింతలి ఆర్ అండ్ బి రోడ్డులో గాదిరాయి గ్రామం వద్ద మదుము నిర్మించారు. అయితే మదుము వద్ద మట్టిని వేసి చదును చేయడం వల్ల వర్షాలు పడటంతో ఆ ప్రదేశంలో బురదమయమైంది. దీంతో వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో పెద్ద వాహనాలు లారీలు దిగబడిపోతున్నాయి.

పులకించిన సింహగిరి

... 5వ పేజీ తరువాయి

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, తదితరులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవం విజయవంతం కావడానికి కృషి చేశారు.

సేవలందించిన 45 ఆర్టీసీ బస్సులు

దేవస్థానం సుమారు రూ.10 లక్షలు చెల్లించి 45 ఆర్టీసీ బస్సులను భక్తుల రాకపోకలకు వినియోగించింది. అవన్నీ రద్దీగా మారడంతో కొందరు ఘాట్‌రోడ్డులో కాలినడకన రాకపోకలు సాగించారు. తొలిపావంచా వద్ద భక్తులు లక్షలాదిగా కొబ్బరికాయలను కొట్టి ప్రదక్షిణలను ప్రారంభించడంతో టన్నుల కొద్దీ కొబ్బరిముక్కలు పోగయ్యాయి. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కాంట్రాక్టర్ వ్యాన్‌లు ఏర్పాటు చేసి, జేసీబీ సాయంతో వాటిని ఎప్పటికప్పుడు తరలించారు.

జీవీఎంసీలో రాజకీయ చదరంగం

... 5వ పేజీ తరువాయి

నిర్వహించాల్సి ఉంది. సాధారణ ఎన్నికల హడావిడి, తరువాత కమిషనర్ బదిలీ వంటి పరిణామాలతో నాలుగు నెలలుగా స్టాండింగ్ కమిటీ సమావేశం జరగలేదు. దీంతో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, రోజువారీ ఖర్చులకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీకి వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి, సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో వచ్చేనెల ఏడున స్టాండింగ్ కమిటీకి ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్, ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ హరేంధిర ప్రసాద్ సోమవారం దీనికి సంబంధించి ప్రకటన చేసే అవకాశం ఉంది.

అప్రమత్తమైన కూటమి నేతలు

స్టాండింగ్ కమిటీ ఎన్నిక నేపథ్యంలో కూటమి నేతలు అప్రమత్తమయ్యారు. సాధారణ ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేయడంతో జీవీఎంసీ మేయర్ పీఠంతో పాటు స్టాండింగ్ కమిటీని కూడా కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. దీని కోసం కౌన్సిల్‌లో బలం పెంచుకునే చర్యలు ప్రారంభించారు. జీవీఎంసీలో ప్రస్తుతం వైసీపీకి 59 మంది కార్పొరేటర్లు, టీడీపీకి 29 మంది, జనసేనకు ఐదుగురు కార్పొరేటర్ల బలం ఉంది. వీరుకాకుండా బీజేపీ, సీపీఐ, సీపీఎంకి ఒక్కొక్కరు, ఇండిపెండెంట్‌గా ఒకరు ఉన్నారు. తాజాగా ఆదివారం 12 మంది కార్పొరేటర్లు వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. వీరిలో ఏడుగురు టీడీపీలో, ఐదుగురు జనసేనలో చేరిపోయారు. దీంతో టీడీపీ బలం 36కి, జనసేన బలం పదికి మొత్తంగా బీజేపీతో కలుపుకుంటే కూటమి బలం 47కి పెరిగింది. అదే సమయంలో వైసీపీ బలం 47కి తగ్గిపోయింది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉండగా, ఒక్కస్థానం దక్కించుకోవాలంటే 97 మంది కార్పొరేటర్లలో కనీసం 49 మంది మద్దతు అవసరం. అంటే ఇరుపక్షాలకు మరో ఇద్దరు సభ్యులు మద్దతు కావాలి. ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ప్రస్తుతం వైసీపీకి మద్దతు ఇస్తుండగా, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్ల నిర్ణయం కీలకంగా మారనుంది.. వీరిద్దరూ కూటమికి మద్దతు తెలిపితే కూటమి అభ్యర్థులు, ఒకవేళ వైసీపీకి మద్దతిస్తే వైసీపీ సభ్యులు స్టాండింగ్ కమిటీలో విజయం సాధిస్తారు.

ఈ నేపథ్యంలో మరో పది మంది కార్పొరేటర్లను చేర్చుకునే దిశగా కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. వారంతా వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేలు, వార్డులోని నేతలు, కార్యకర్తల అభ్యంతరాల నేపథ్యంలో తీసుకోలేదని ప్రచారం జరుగుతోంది. అభ్యంతరాల్లేని కార్పొరేటర్లలో కనీసం పది మందిని చేర్చుకుంటామని కూటమి నాయకులు ప్రకటించడంతో వైసీపీ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పుడున్న 47 మంది కార్పొరేటర్లు చేజారిపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహరచన చేస్తున్నారు. కొత్తగా కార్పొరేటర్ల చేరికల నేపథ్యంలో టీడీపీ, జనసేన కార్పొరేటర్లలో నెలకొన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని యత్నిస్తున్నారు. వారి మద్దతుని రాబట్టుకోవడం ద్వారా స్టాండింగ్ కమిటీలో నగం స్థానాలైనా కాపాడుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సంక్షిప్తంగా..

వడ్డాదిలో మోదకొండమ్మ పండగ రేపు



బుచ్చెయ్యపేట, జూలై 21 : వడ్డాదిలో మోదకొండమ్మ, మోదమాంబ అమ్మవార్ల పండగను మంగళవారం నిర్వహించనున్నారు. వడ్డాది కూడలిలో ఉన్న మోదకొండమ్మ, వడ్డాది పాత సిని మాహాల్ వద్ద కొలువైయున్న మోదమాంబ అమ్మవార్ల దేవాలయాలకు రంగులు వేశారు. విద్యుత్ అలంకరణలు చేపట్టారు. పండగలో నేలవేషాలు, బ్యాండు వాయిదాలు, సాము గరిడీలను ఏర్పాటు చేశారు. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు ఉత్సవ కమిటీలు తెలిపాయి.

అంగన్‌వాడీ భవనంలోకి పాఠశాల మార్పు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మాకవరపాలెం, జూలై 21 : మండలంలో తాడపాల ప్రాథమికోన్నత పాఠశాలను అదే గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనం కమ్యూనిటీ హాలుకు మార్చారు. 'పాఠశాలలోకి వర్షం నీరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో పీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఈ పాఠశాల పై కప్పు నుంచి వర్షం నీరు పడుతుండడం, తరగతి గది చిత్తడిగా మారడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

బస్‌స్టేషన్ వద్ద గోతుల పూడ్చివేత



గోడులు పూడ్చుతున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, జూలై 21 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణ మరమ్మతులు చేపడుతున్నారు. స్థానిక సర్పంచ్ లోచల సుజాత చొరవతో ఆదివారం ఆవరణలోని బురదను తొలగించారు. ఈ బస్‌స్టేషన్ ముందు భారీ గోతులు ఏర్పడడంతో చిన్నపాటి వర్షం వచ్చినా చెరువుతా మారేది. ఈ నేపథ్యంలో గోతులను పూడ్చే పనులు చేపట్టారు. దీంతో ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి శిక్షా సప్తాహ్

మాకవరపాలెం, జూలై 21 : మండలంలో సోమవారం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ నిర్వహిస్తున్నట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అదేశాల మేరకు జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020ప్రవేశపెట్టిన 4వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 22 నుంచి 28 వరకు వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ వర్క్‌షాప్‌నకు అబ్బు ఎంపిక



నర్సీపట్నం, జూలై 21 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలాలో స్పోర్ట్స్ సైకాలజీ, పౌష్టికాహార నియమాలపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు శాప్ కోచ్ అబ్బు ఎంపికయ్యారు. క్రీడాకారులలో మానసిక, శారీరకం దృఢత్వం, పౌష్టికాహార నియమాలపై ఈనెల 22 నుంచి ఆరు రోజుల పాటు అబ్బు శిక్షణ తీసుకుంటారు.

23 నుంచి గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు : ఎంపీడీవో

- 5 రోజుల పాటు నిర్వహణ

దేవరాపల్లి, జూలై 21 : మండలంలోని పది గ్రామ సచివాలయాల్లో ఈనెల 23 నుంచి 27 వరకు ఆధార్ నమోదు కేంద్రాల శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పరిధిలో పెండింగ్‌లో ఉన్న బయో మెట్రిక్ అప్‌డేట్, కొత్త ఆధార్ నమోదు,.ఆధార్ డాక్యుమెంటు వివిధ సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈనెల 23న దేవరాపల్లి సచివాలయం-1, 2లో జరుగుతుందని, 24న రైవాడ, కాశీపురం, 25న పెదనందిపల్లి, ఏ.కొత్తపల్లి, 26న తెనుగుపూడి, వాకపల్లి, 27న వేచలం, మామిడిపల్లి గ్రామాల్లో జరుగుతుందన్నారు.

రావికమతం : ఆధార్ సేవలకు మండలంలో తొమ్మిది ప్రత్యేక నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో భానోజీరావు తెలిపారు. ఈనెల 23 నుంచి 27 వరకూఈ ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ సంబంధిత సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పెట్టుబడుల కింద రూ.20 వేలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయినబాబు

దేవరాపల్లి, జూలై 21 : కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వ్యవసాయ పెట్టుబడులు కింద రూ.20 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండినాయనబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడుల కింద రూ.20 వేలు అందించాలన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చే 22 జీవోను రద్దు చేయాలని, ఉపాధి కూలీలు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.

నాతవరంలో గురుపౌర్ణమి పూజలు

నాతవరం, జూలై 21 : మండల కేంద్రం నాతవరం షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం మంగళ స్నానం, అలంకరణ, అభిషేకం, కలసాల పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ గోపురానికి విశేష అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.